సాక్షి
నిర్మల్

శుక్రవారం । 28 । జూలై । 2023



గేట్లపై నుంచి వరద...

నిండుగా కడెం ప్రాజెక్ట్

కడెం ప్రాజెక్ట్‌కు గురువారం తెల్లవారు జామున ఉప్పెనలా వరద పోటెత్తింది. గంట గంటకూ ఇన్‌ఫ్లో పెరిగింది. మరోవైపు గేట్లు తెరుచుకోకపోవడంతో టెన్షన్ నెలకొంది. గరిష్టంగా 3.87 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 2.42 లక్షల నీటిని కిందకు వదిలారు.

- కడెం

క్యూసెక్కుల్లో..

	ఉదయం	ఉదయం	ఉదయం	ఉదయం	సాయంత్రం	రాత్రి
ఇన్‌ఫ్లో	2,95,618	3,87,583	3,86,284	2,82,583	1,35,127	1,01,662
ఔట్‌ఫ్లో	1,36,607	2,18,922	2,42,901	2,36,206	2,07441	1,59,827

న్యూస్‌రీల్

జిల్లా ప్రత్యేక అధికారిగా ముషరఫ్ అలీ



ముంపు ప్రాంతాల్లో ప్రత్యేకాధికారి ముషరఫ్ అలీ

నిర్మల్ ఖిల్లా: నిర్మల్ జిల్లాలో భారీ వర్షాలకు వరదలు పోటెత్తుతున్నాయి. ప్రాజెక్టులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో జిల్లా యంత్రాంగానికి సహకరిస్తూ సమన్వయం పరిచేందుకు జిల్లా ప్రత్యేక అధికారిగా ఎక్సైజ్ శాఖ కమిషనర్ ముషరఫ్ అలీ ఫారూఖీని ప్రభుత్వం నియమించింది. ముషరఫ్ అలీ గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో ఇదే జిల్లాకు ఆయనను వరదల సమీక్ష, సహాయం కోసం నియమించినట్లు భావిస్తున్నారు. ప్రత్యేక అధికారిగా నియమితులైన ముషరఫ్ అలీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. నిర్మల్ పట్టణంలో నీట మునిగిన ప్రాంతాలను సందర్శించారు. శుక్రవారం కూడా అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు బయటకు రావద్దన్నారు. అత్యవసర సమయంలో కంట్రోల్ రూం 9398749227 నంబర్‌కు కాల్ చేయాలన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్ రూరల్: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో ఇచ్చే అవార్డుకు జిల్లాలోని అర్హత గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తమ దరఖాస్తులను తగిన ఆధారాలతో ఆగస్టు 7వ తేదీలోగా డీఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు. దరఖాస్తులను ప్రాంతీయ విద్యా సంచాలకులు ఏర్పాటు చేసిన కమిటీ ఆగస్టు 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పరిశీలించి, ఆగస్టు 20వ తేదీన తుది జాబితాను ప్రకటిస్తారన్నారు. ఎంపికైన వారికి బంగారు పూత గల రజత పతకం, రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రం అందించి సత్కరిస్తారని వివరించారు.

బయటకు రావొద్దు

- ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. జి ల్లా ప్రజలు తగిన జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుకోని విధంగా ఏదైనా ప్రమాదం ఎదురైతే సాయం కోసం 100కు ఫోన్ చేయాలని సూచించారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలకు దూరంగా ఉండాలన్నారు. ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువులు, తీగలను తాకొద్దని సూచించారు. వర్షం పడే సమయంలో చెట్ల కింద‌కు వెళ్లొద్దని పేర్కొన్నారు. పొలాల వద్దకు మొబైల్ ఫోన్స్ తీసుకెళ్లొద్దన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కూలిపోయే స్థితిలో ఉన్న, మట్టి గోడల ఇళ్లలో ఉండొద్దన్నారు. వాగులుదాటే ప్రయత్నం చేయొద్దని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, వాగులు, రిజర్వాయర్లు, చెరువులు, జలపాతాలవద్దకు వెళ్లొద్దని పేర్కొన్నారు.

నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ రూరల్: జిల్లాలో అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో 3 నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కురన్నపేట్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఒక డే వాచ్ వుమెన్(ఓసీ జనరల్), ఒక స్వీపర్ కం స్కావెంజర్ (బీసీ–బీ, జనరల్), ఒక అసిస్టెంట్ కుక్ (ఓసీ–ఉమెన్) పోస్ట్ ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అన్ని పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించినట్లు వివరించారు. దరఖాస్తులను ఆగస్టు 1 నుంచి 5వ తేదీలోపు డీఈవో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

జల విలయం

- పోటెత్తిన కడెం ప్రాజెక్టు
- 'సిరాల'కట్టకు గండి..
- భైంసాలో భారీగా వర్షం
- భీకరంగా స్వర్ణమ్మ ప్రవాహం
- జల దిగ్బంధంలో నిర్మల్
- మళ్లీ మునిగిన జీఎస్‌ఆర్ కాలనీ
- చెరువులకు గండ్లు.. కొట్టుకుపోయిన రోడ్లు
- స్తంభించిన జనజీవనం.. రాకపోకలు



నిర్మల్: జిల్లాలో భారీ వర్షాలకు మహారాష్ట్ర వరదలు తోడవ్వడంతో జలం జిల్లాలో విలయం సృష్టించింది. బుధవారం అర్ధరాత్రి దాటిన నుంచి వర్షం మొదలైంది. గురువారం రోజంతా ఏకధాటిగా కురిసింది. పలు మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. కడెం ప్రాజెక్టు పైనుంచి వరద పోటెత్తింది. లోతట్టును మొత్తం సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వచ్చింది. భైంసాలో ఆకాశానికి చిల్లుపడినట్లు భారీవర్షం కురిసింది. సిరాల ప్రాజెక్టు కట్టకు గండి పడి ఊరంతా మునిగింది. సుద్దవాగు ఉప్పొంగగా, గడ్డెన్నవాగు ప్రాజెక్టు దిగువన లోతట్టు మొత్తం మునిగింది. భైంసా ఆర్టీసీ డిపో జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఎగువన మహారాష్ట్ర నుంచి వరదలు రావడం, ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో స్వర్ణమ్మ సైతం పోటెత్తింది. దిగువన నిర్మల్ జిల్లాకేంద్రంలో స్వర్ణమ్మ ఒడ్డున గల జీఎస్‌ఆర్ కాలనీ మళ్లీ నీట మునిగింది. కాలనీవాసులను సమీప ఆల్ఫోర్స్ స్కూల్‌కు తరలించారు. సిద్ధాపూర్ సమీపంలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్లల్లోకి స్వర్ణ నీళ్లు చేరాయి. అందులో ఉన్న కార్మికులను కాపాడారు. జిల్లాకేంద్రంలో భారీ వర్షానికి రోడ్లన్నీ నీటమునిగాయి. చెరువుల అలుగుల ద్వారా చేపలు రావడంతో రోడ్లపైనే చేపలు పట్టారు. స్వర్ణ ప్రవాహంతో సోన్ మండలం కడ్తాల్‌వద్ద ఎన్‌హెచ్. 44 మునగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మూడు నియోజకవర్గాల్లోని నదులు, వాగులు, ప్రాజెక్టులు, చెరువులు పొంగడంతో రోడ్లు కోతకు గురయ్యాయి. వర్షం, వరద ప్రభావిత, ముంపు ప్రాంతాలను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌లతోపాటు జిల్లాకు ప్రత్యేకాధికారి, ఎక్సైజ్ కమిషనర్ ముషరఫ్‌అలీ పరిశీలించారు. బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులూ జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించి, అధికార పార్టీపై ఆరోపణలు గుప్పించారు.

మళ్లీ మునిగిన నిర్మల్..

రెండేళ్లుగా వెంటాడుతున్న వర్షాలు, వరదలు నిర్మల్‌ను వెంటాడుతున్నాయి. జిల్లాకేంద్రంలో బుధవారం అర్ధరాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. జీఎస్‌ఆర్ కాలనీ, సిద్ధాపూర్ వైఎస్‌ఆర్ కాలనీ, శాస్త్రినగర్, ఇంద్రానగర్, రవినగర్, శివాజీచౌక్, డాక్టర్స్‌లైన్, విజయనగర్, మంజులాపూర్, ప్రియదర్శినినగర్, భైంసా, మంచిర్యాల, ఆదిలాబాద్‌వైపు వెళ్లే రోడ్లన్నీ మునిగిపోయాయి. స్థానిక శివాజీచౌక్‌లో భారీగా నీరు నిలువడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మంజులాపూర్ చెరువులో నుంచి చేపలు వర్షపు నీటితో కొట్టుకువచ్చాయి. భైంసారోడ్డులో పలుచోట్ల స్థానికులు, జాలర్లు చేపలను పట్టుకున్నారు.

భైంసాలో 'భారీ'ష్...!

భైంసాటౌన్: భైంసా పట్టణంలో గురువారం జిల్లాలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. బుధవారం అర్ధరాత్రి మొదలు గురువారం రోజంతా కుండపోత వర్షం కురిసింది. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 26 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీనికితోడు ఎగువన మహారాష్ట్రలో కురిసిన వర్షానికి భైంసాలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు తొలుత రెండు గేట్ల నుంచి ఏడు గేట్ల వరకు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టుకు 1.18 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, ప్రాజెక్టు నిర్మించిన నాటి నుంచి ఇదే గరిష్టస్థాయిలో వరదనీరు రావడం మొదటిసారని అధికారవర్గాలు తెలిపాయి. వరదనీటి ధాటికి దిగువన భట్టిగల్లి, గణేశ్‌నగర్, కుభీర్ చౌరస్తా, ఆటోనగర్, వినాయక్‌నగర్, గోకుల్‌నగర్, భాగ్యలక్ష్మినగర్, రాహుల్‌నగర్, పూలేనగర్ కాలనీలు జలమయమయ్యాయి. ఆర్టీసీ డిపోను సైతం వరదనీరు ముంచెత్తడడంతో తొమ్మిదిమంది సిబ్బంది నీటిలోనే చిక్కుకుపోయారు. రాహుల్‌నగర్‌లో లోతట్టుప్రాంతంలోకి నీరు రావడంతో సామగ్రితో పలు కుటుంబాలు సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లారు.

కొనసాగుతున్న సహాయక చర్యలు..

వరద ప్రభావం ఎక్కువగా ఉండడంతో ఆయా ప్రాంతాల్లో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, సీఐ ఎల్.శ్రీను, అధికార యంత్రాంగం సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఆర్టీసీ డిపోలో చిక్కుకున్న సిబ్బందిని తెప్పల సహాయంతో బయటికి తీసుకొచ్చారు. ఆటోనగర్, రాహుల్‌నగర్ ప్రాంతాల్లో ఇళ్లలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

జలదిగ్బంధంలో జీఎస్‌ఆర్ కాలనీ..

రెండేళ్లక్రితం సరిగ్గా ఇదే నెలలో జలప్రళయాన్ని చవిచూసిన జిల్లా కేంద్రంలోని జీఎస్‌ఆర్ కాలనీవాసులు మళ్లీ గురువారం అదే నరకాన్ని అనుభవించారు. స్వర్ణప్రాజెక్టు ఆరు గేట్లు ఎత్తి దాదాపు 30 వేల క్యూసెక్కుల నీటిని వదలడం, స్థానికంగా భారీ వర్షాలు కురవడంతో లోతట్టున ఉన్న జీఎస్‌ఆర్ కాలనీలోకి వరద పోటెత్తింది. దిగువన ఎస్సారెస్పీ నీటితో గోదావరి పరవళ్లు తొక్కడంతో స్వర్ణ నీరు ఎదురుతన్ని, కాలనీలోకి చొచ్చుకువచ్చాయి. దీంతో రెండేళ్ల క్రితం ఎదురైన పరిస్థితే మళ్లీ ఏర్పడింది. స్థానిక కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి కాలనీవాసులను సమీపంలో ఆల్ఫోర్స్ స్కూల్‌లో ఏర్పా టు చేసిన శిబిరానికి తమ వాహనాల్లోనే తరలించారు. ఒక్కసారిగా వచ్చిన వరదనీటితో కాలనీలో గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం మునిగిపోయింది. చాలామంది అన్నీ వదిలేసి కట్టుబ ట్టలతో బడిలో ఏర్పాటు చేసిన శిబిరానికి వ చ్చారు. వారికి మున్సిపల్, వివిధ సంఘాలవారు ఆహారాన్ని అందిస్తున్నారు.



జిల్లాలో వర్షపాతం..

(గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు..)

మండలం	నమోదైన వర్షపాతం (మిల్లీమీటర్లలో..)
భైంసా	259.2
ఖానాపూర్	235.6
తానూరు	209.8
కుంటాల	201.2
నర్సాపూర్(జి)	150.3
కుభీర్	146.0
ముధోల్	142.4
లోకేశ్వరం	141.8
కడెం	134.3
లక్ష్మణచాంద	122.8
బాసర్	117.0
దిలావర్‌పూర్	86.8
సోన్	77.6
నిర్మల్‌అర్బన్	64.2
నిర్మల్‌రూరల్	57.8
సారంగపూర్	55.5
మామడ	50.2
దస్తురాబాద్	45.0
పెంబి	38.6
సగటు వర్షపాతం	123.0

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



జీఎస్‌ఆర్ కాలనీలో పర్యటించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్‌టౌన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్, సిద్ధాపూర్, జీఎస్‌ఆర్‌కాలనీ ప్రాంతంలో మంత్రి పర్యటించి వరద పరిస్థితిని సమీక్షించారు. స్వర్ణ జలాశయం నుంచి భారీగా వరద నీరు విడుదల చేయడంతో స్వర్ణ వాగు ఉప్పొంగి ప్రవహిస్తోందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ముందస్తు చర్యల్లో భాగంగా కాలనీ ప్రజలను స్థానిక ఆల్ఫోర్స్ స్కూల్‌కు తరలించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కౌన్సిలర్లు అన్వర్ పాషా, ముజాహిద్ చౌస్, కోఆప్షన్ కోటగిరి అశోక్, గజేందర్, మున్సిపల్, సంబంధిత అధికారులు ఉన్నారు.

వంతెనను కమ్మిన వరద

కడెం: కడెం ప్రాజెక్ట్ నుంచి భారీగా వరద రావడంతో దిగువన పాండ్వాపూర్ సమీపంలోని వంతెనకు ఇరువైపులా వరద ఉధృతంగాప్రవహిస్తోంది. ప్రమాదకరంగా నీళ్లు వెళ్లడంతో పోలీసులు ఉదయం నుంచే వంతెనపై రాకపోకలు నిలిపివేశారు. దీంతో కడెం– జన్నారం మధ్య రాకపోలు నిలిచిపోయాయి.

రాత్రి గడిచేదేలా..

కడెం వరద పాండ్వాపూర్ వంతెన వద్ద ఉదయం సాఫీగా వెళ్లింది. అయితే శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో గోదావరిలో నీటి ప్రవాహం పెరుగుతుంది. దీంతో కడెం దిగువనగల వంతెన వద్ద కడెం ప్రాజెక్ట్ నుంచి వచ్చే నీళ్ల పోటుకమ్మి లోతట్టు ప్రాంతాలు నీటమునిగే అవకాశం ఉంది. దీంతో పరీవాహక ప్రజలు రాత్రి ఎలా గడుస్తుందో అని భయందోళన చెందుతున్నారు.



పాండ్వాపూర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కడెం వాగు..

గోదావరి భయం..!

- ఎస్సారెస్పీ గేట్ల ఎత్తివేత
- మూడులక్షల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో
- జిల్లా పరీవాహకంలో టెన్షన్

నిర్మల్: జిల్లాకు సరిహద్దుగా ఉన్న గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. బాసర నుంచి దస్తురాబాద్ వరకు సరిహద్దు పొడవునా పలు పరీవాహక గ్రామాలు ఉన్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువన సోన్ మండలంలోని పలు గ్రామాలు, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి), లోకేశ్వరం, బాసర మండలాలు ఉండగా, ఎస్సారెస్పీ దిగువన సోన్‌లోని పలు గ్రామాలు, లక్ష్మణచాంద, మామడ, ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ మండలాలు ఉన్నాయి. ప్రస్తుతం బ్యాక్‌వాటర్ కంటే దిగువన వరద ప్రవాహం భీకరంగా సాగే గ్రామాలు ఆందోళనలో ఉన్నాయి.



ఎస్సారెస్పీ నుంచి నీటివిడుదల

32 గేట్లు ఎత్తి..

మహారాష్ట్రలో భారీ వర్షాలతో క్రమంగా వరద పెరగడంతో గురువారం రాత్రి వరకు ఎస్సారెస్పీకి 3.8 లక్షల క్యూసెక్కుల వరద చేరుతోంది. అదేస్థాయిలో 32 గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు. మొత్తం 90.3 టీఎంసీలకు గానూ 78.661 టీఎంసీల నీరు చేరింది. భారీగా ఇన్‌ఫ్లో ఉండటంతో అదేస్థాయిలో దిగువకు వదులుతున్నారు. భారీగా వచ్చే వరదతో ప్రధానంగా దస్తురాబాద్ మండలంలోని దేవునిగూడెం, భూత్కూర్, మున్యాల్, గొడిసిర్యాల గ్రామాలకు ముప్పు పొంచి ఉంది. ఈ గ్రామాలకు మరోవైపు నుంచి కడెం వాగు ఉప్పొంగుతుండటమే కారణం.



భైంసా సిరాల ప్రాజెక్టు గండి నుంచి వరద



వరదలో భైంసా వినాయకనగర్.



నిర్మల్ శివాజీ చౌక్‌లో రోడ్డుపై వరద...



పునరావాస కేంద్రంలో జీఎస్‌ఆర్ కాలనీవాసులు



బాధితులను తీసుకువస్తున్న స్థానిక కౌన్సిలర్..

కార్మికుల సంక్షేమానికి పాటుపడాలి

- ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల

నిర్మల్‌ఖిల్లా: జాతీయ, అంతర్జాతీయ చట్టాలు కార్మిక సంక్షేమానికి పాటుపడేలా ఉండాలని ప్రవాస మిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల అన్నారు. అంతర్జాతీయ కార్మిక చట్టాలపై బీడబ్ల్యూఐ సంస్థ ఈనెల 26, 27 తేదీల్లో ఇండియన్ అఫ్లియేటిడ్ కౌన్సిల్ ఐఏసీలో రాష్ట్రం తరఫున స్వదేశ్ పాల్గొని ఉపన్యాసం చేశారు. గల్ఫ్ దేశాలలో పెను వాతావరణ మార్పుల వలన భారత కార్మికుల గుండెపై తీవ్ర ప్రభావం వల్ల సహజ మరణాలు పెరిగినాయని, ఈ వాతావరణ మార్పులు చిన్నారులు, మహిళలు, వికలాంగుల వలస కార్మికుల మానసిక శారీరక ఆరోగ్యంపై విపరీత ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. దుబయ్‌లో నవంబర్ 30 నుండి డిసెంబర్ 12 వరకు జరిగే అంతర్జాతీయ వాతావరణ మార్పుల సదస్సులో అన్నిదేశాలు వేగవంతమైన చర్యలు తీసుకోవాలని స్వదేశ్ విజ్ఞప్తి చేశారు.



జాతీయ సమావేశంలో మాట్లాడుతున్న స్వదేశ్

ఆపదలో అండగా..



జేసీబీతో దుంగలను తొలగిస్తున్న దృశ్యం

కడెం: కడెం ప్రాజెక్ట్ నాలుగు గేట్లు మొరాయించడం.. ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో అంతకంతకు పెరిగింది. 3 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చిన సమయంలో.. దిగువకు కేవలం 2 లక్షల క్యూసెక్కులు మాత్రమే వదిలారు. మరో నాలుగు గేట్లు తెరుచుకోకపోవడంతో ప్రాజెక్టు మళ్లీ భయపెట్టింది. ఈ పరిస్థితిలో ప్రాజెక్ట్ అధికారుల పిలుపు మేరకు మండలంలోని పాండ్వాపూర్ గ్రామానికి చెందిన గొర్రె మధుకర్ తన జేసీబీతో కడెం ఎడమ కాలువ గుండా ప్రాజెక్ట్ వద్దకు చేరుకున్నాడు. వరద గేట్లలో చిక్కుకపోయిన భారీ కలప దుంగలను తొలగించాడు. దీంతో మరో రెండు గేట్లను మాన్యువల్‌గా ఎత్తే అవకాశం ఏర్పడింది.



కాలువ పక్కన కోతకు గురవుతున్న రోడ్డు

ఎడమ కాలువ వద్ద భారీగా కోత

కడెం: కడెం నీటిమట్టం దాటిపోవడంతో.. గతేడాది మాదిరిగానే కడెం ఎడమ కాలువ(కట్ట మైసమ్మ)వద్ద ఓవర్ ఫ్లోతో..తూము గేట్లనుంచి నీళ్లు భారీగా రావడంతో దిగువన రోడ్డు కోతకు గురైంది.

ప్రాజెక్ట్‌పైనే ఎమ్మెల్యే..

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు భారీ వరదలు వస్తున్నాయని స్థానిక ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ సమాచారం అందుకుని తెల్లవారుజామునే ప్రాజెక్ట్ వద్దకు చేరుకున్నారు. ప్రజలంతా భయంతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు.. గేట్లు మొరాయించడంతో అధికారులు సైతం ప్రాజెక్ట్‌ను వదిలి వచ్చేశారు. ప్రాజెక్ట్‌ను వదిలి రావాలని పోలీసులు చెప్పినా.. ఎమ్మెల్యే ప్రాజెక్ట్‌పైనే ఉండి ప్రజలను అప్రమత్తం చేశారు.

కట్ట మైసమ్మకు మొక్కిన మంత్రి

కడెం: కడెంకు భారీగా వరదలు రావడంతో.. రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రాజెక్టును గురువారం సందర్శించారు. గతేడాది వరదల సమయంలో కట్ట మైసమ్మ ప్రాజెక్టును కాపాడారని ఎమ్మెల్యే రేఖానాయక్, స్థానికులు మంత్రికి తెలిపారు. దీంతో మంత్రి ఈసారి కూడా ప్రాజెక్టును కాపాడాలని అమ్మవారికి మొక్కుకున్నారు. 'అమ్మ మైసమ్మతల్లి డ్యాంను రక్షించు' అని ప్రాజెక్ట్ గేజ్ రూంలో కట్ట మైసమ్మకు మొక్కారు.



గేజ్ రూంలో మంత్రి ఐకేరెడ్డి, ఎమ్మెల్యే రేఖానాయక్

డీ27 కాలువకు గండి

ఖానాపూర్: మండలంలోని పాత తర్లపాడ్ గ్రామం నుంచి ప్రవహించే సరస్వతి కాలువ డిస్ట్రిబ్యూటరీ 27కు గురువారం గండి పడింది. భారీ వర్షం కారణంగా కాలువకు గండి పడి నీరంతా పొలాల్లోకి వెళ్లింది. గతేడాది గండి పడిన చోటే తిరిగి గండి పడిందని స్థానిక రైతులు తెలిపారు. అధికారులు వెంటనే గండి పూడ్చాలని రైతులు కోరుతున్నారు. నాసిరకం పనులతోనే మళ్లీ గండి పడిందని ఆరోపిస్తున్నారు.

ప్రజలను అప్రమత్తం చేసిన కలెక్టర్

కడెం: కడెం ప్రాజెక్ట్ భారీ వరదలతో డేంజర్ జోన్‌లోకి వెళ్లడంతో లోతట్టు ప్రాంత వాసులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అప్రమత్తం చేశారు. ఉదయం నుంచి ప్రాజెక్ట్ వద్ద పరిస్థితిని సమీక్షిస్తునే.. లోతట్టు గ్రామలైనా కన్నాపూర్, కొండుకూర్, పాండ్వపూర్, అంబారిపేట్, తదితర గ్రామల్లో పర్యటించి అప్రమత్తం చేశారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ కడెంకు చేరుకుని అంబులెన్స్, ఫైర్, పోలీస్ ప్రత్యేక బలగాలను దించారు. కడెం వాసులు మండల కేంద్రంలోని రైతువేదిక, ప్రభుత్వ ఆసుపత్రి, ఐబీ, కన్నాపూర్ వాసులు ఎల్ఎంఆర్ డిగ్రీ కళాశాలలో ఉన్నారు.



క్లుప్తంగా

వామ్మో కొండచిలువ..!


చెట్టుపై కొండచిలువ

కుంటాల: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని అందాకూర్ చెరువు రాగి చెట్టుపై గురువారం పెద్ద కొండ చిలువ కనిపించింది. అందాకూర్ చెరువు కట్టపై నుంచి వరద నీరు వెళ్లడంతో అక్కడికి వెళ్లిన గ్రామస్తులు గుర్తించారు. సుమారు10 ఫీట్ల పొడవు 50కిలోల బరువు ఉంటుందన్నారు. అటవీశాఖ అధికారులు కొండచిలువను తీసుకెళ్లాలని గ్రామస్తులు కోరుతున్నారు

'కుంటాల'.. నో ఎంట్రీ


అడ్డుకుంటున్న అధికారులు

నేరడిగొండ: భారీ వర్షాలతో కుంటాల జలపాతానికి సందర్శకులను అనుమతించడం లేదని ఎఫ్ఆర్వో గణేశ్, ఎస్సై సాయన్న తెలిపారు. గురువారం నేరడిగొండ నుంచి కుంటాల వెళ్లే రహదారిలో అటవీశాఖ, పోలీసు సిబ్బంది జలపాతానికి వెళ్లే పర్యాటకులు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. వర్షం కారణంగా జలపాతం వద్ద ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉండడంతో పర్యాటకులను అనుమతించడం లేదని తెలిపారు.

ద్విచక్రవాహనం నుంచి పడి మహిళ మృతి

ఉట్నూర్‌రూరల్: ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతిచెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హస్నాపూర్ గ్రామానికి చెందిన షేక్ సబియాన్(52) కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తోంది. ఇదే తరుణంలో ఉదయాన్నే ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు నుంచి కూరగాయలు కొనుగోలు చేసి అటుగా వెళ్తున్న తుకారాంకు చెందిన ద్విచక్ర వాహనంపై హస్నాపూర్ గ్రామానికి వెళ్తున్న క్రమంలో లాల్ టేకిడి సమీపంలో వర్షాలకు ఏర్పడ్డ గుంతలను తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడింది. గమనించిన లింగోజితాండ సర్పంచ్ వైద్యం కోసం ఆటోలో ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్ మీటర్ల దగ్ధం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని వినాయక్‌చౌక్ ఏరియాలోని మజీద్ టవర్‌లోని కాంప్లెక్స్‌లో గురువారం షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ఉదయం 11గంటల ప్రాంతంలో కాంప్లెక్స్‌లో విద్యుత్ మీటర్ల వద్ద మంటలు ఎగిసిపడ్డాయి. పక్కపక్కనే కాంప్లెక్స్‌కు సంబంధించిన ఆరు మీటర్లు ఉండడంతో దగ్ధమయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమందించారు. దీంతో వారు అక్కడికి చేరుకుని సీఓ2 ద్వారా మంటలను ఆర్పివేశారు. దాదాపు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లినట్లుగా స్టేషన్ ఫైర్ అధికారి శివాజీ తెలిపారు.


సారంగపూర్: స్వర్ణప్రాజెక్టు పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి


సారంగపూర్: బీరవెల్లి-లోలం గ్రామాల మధ్య కోతకు గురైన రహదారి


బోథ్ : అలుగు దూకుతున్న కరత్వాడ జలపాతం

జల ప్రళయం


కుభీర్: ఎల్లమ్మ చెరువు కట్టపై నుంచి పారుతున్న నీళ్లు

- వర్షాలతో అతలాకుతలమవుతున్న జనం
- మునిగిపోతున్న పంట పొలాలు
- ఇళ్లల్లోకి చేరుతున్న వరద
- వంతెనలు మునిగి.. నిలిచిన రాకపోకలు
- తానూరులో 209.8 వర్షపాతం
- సిరాల ప్రాజెక్టుకు గండి
- తెగిన ఇలేగాం కొత్త చెరువు
- ముథోల్ – భైంసా మధ్య నిలిచిన ప్రయాణం
- స్వర్ణ ప్రాజెక్టు 6గేట్లు ఎత్తివేత
- తెగిపోయిన బోరిగాం చెరువు ఆనకట్ట

కుభీర్: మండలంలో గురువారం కురిసిన భారీవర్షానికి వాగులన్నీ పొంగిపొర్లాయి. మండల కేంద్రమైన కుభీర్‌లోని మెదరివాడ, ఎస్సీకాలనీ, నయా అబాదిలోని ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి భోజన సదుపాయం కల్పించారు.

వరదలో కొట్టుకుపోయి.. ప్రాణాలతో బయటపడి..

కుభీర్ నుంచి స్వగ్రామం పార్డి(బి)కి మోటారు సైకిల్‌పై వెళ్తున్న కె.రాజు, జితేందర్, యోగేష్ వాగు దాటుతుండగా కొట్టుకపోయారు. జితేందర్, యోగేష్ చెట్లపొదలను పట్టుకొని బయటకురాగా, బైక్ నడిపిన రాజు కొట్టుకపోతున్న కర్రమొద్దుపై ఎక్కి కొద్ది దూరం వెళ్లగా పార్డి(బి) గ్రామస్తులు కాపాడారు.

కురిసిన భారీ వర్షం

తానూరు: మండలంలోని బోల్సా, కోలూరు, భోసి, మొగ్లి, ఎల్విత్, వాడవన గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వరదనీరు చేరడంతో ఇంట్లోని సామగ్రి తడిసిపోయింది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలో 209.8 వర్షాపాతం నమోదు కావడం ఇదే తొలిసారి.

చెరువును తలపిస్తున్న ఎంపీడీవో కార్యాలయం..

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు మొత్తం వర్షం నీటితో చెరువును తలపించేలా తయారయ్యాయి.

భైంసా డివిజన్‌లో భారీ వర్షం

భైంసా/భైంసారూరల్: భైంసా డివిజన్‌లో భారీ వర్షం జనజీవనాన్ని అతలాకుతలంచేసింది. భైంసా మండలం సిరాల ప్రాజెక్టులో నీటి మట్టం పెరిగి కట్టపై నుంచి నీరుదొర్లాయి. అప్రమత్తమైన గ్రామస్తులు పశువులను తీసుకుని గుట్టపైకి వెళ్లారు. ప్రాజెక్టు కట్టపై ఉన్న రామస్వామి ఆలయం కుప్పకూలింది. ఆలయం కూలిన వెంటనే పక్కనే కట్టకు గండి పడింది. భారీ వర్షంతో ముథోల్ – భైంసా మధ్యలో రాకపోకలు నిలిచిపోయాయి. గుండేగాం వంతెన మళ్లీ నీటమునిగింది.

జనజీవనం అతలాకుతలం

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి మీదుగా లోలం వెళ్లే రహదారి కోతకు గురైంది. దీంతో పాటు బోరిగాం గ్రామంలో చెరువు ఆనకట్ట వరద ఉధృతికి తట్టుకోలేక కోతకు గురైంది. ఇక స్వర్ణ ప్రాజెక్టు ఆరు వరదగేట్లు ఎత్తడంతో స్వర్ణ నది పరివాహక పంటపొలాలు జలమయమయ్యాయి.

మొరాయించిన రెండోగేటు...

ప్రాజెక్టు రెండవ గేటు విద్యుత్ మోటార్లతో పైకి లేవకపోవడంతో అప్రమత్తమైన అధికారులు జౌళి గ్రామస్తుల సహకారంతో మ్యానువల్‌గా హ్యాండిల్ ద్వారా పైకెత్తారు. స్వర్ణ ప్రాజెక్టును మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరిశీలించారు.

హిప్నెల్లి చెరువుకు గండి

తానూరు: మండలంలోని హిప్నెల్లి గ్రామ సమీపంలోని హిప్నెల్లితండా రోడ్డుకు ఉన్న చెరువుకు గండిపడింది. వందల ఎకరాల పొలాల్లో వరద చేరింది.

వరదల్లో చిక్కుకున్న కూలీలు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సిద్దాపూర్ – కొట్లకే శివారులో డబుల్‌బెడ్ రూమ్ నిర్మాణ కూలీలు గురువారం వరదలు చిక్కుకోవడంతో అధికారులు, పోలీసులు వారిని రక్షించి పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇక్కడ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన దాదాపు 200 మంది కూలీలు పనిచేస్తున్నారు.

జీఎస్ఆర్ కాలనీ జలమయం..

నిర్మల్ ఖిల్లా: జిల్లా కేంద్రంలోని సిద్దాపూర్ పరివాహక ప్రాంతంలోని జీఎస్ఆర్ కాలనీ పూర్తిగా జలమయమైంది. స్వర్ణ ప్రాజెక్టు వరద గేట్లు విడుదల చేయడంతో సిద్దాపూర్ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో వాగునీటి వరద ప్రవాహం జీఎస్ఆర్ కాలనీ చుట్టుముట్టింది.

ఆహారపదార్థాల పంపిణీ...

శిబిరంలోని బాధిత కుటుంబాలకు నిర్మల్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాదాపు రూ.15వేలు విలువగల 73దుప్పట్లు, ఆహారంగా బిస్కెట్ ప్యాకెట్లు ఇతర ఆహార దినుసుల్ని పంపిణీ చేశారు.

శివుని ముంచెత్తిన గంగ..!


వరదలో శివుని విగ్రహం

భైంసాటౌన్: భైంసా పట్టణంలో గతంలో ఎన్నడూ లేనంతగా వర్షం కురిసింది. గతంలో పోలిస్తే తక్కువ సమయంలోనే భారీస్థాయిలో వర్షం కురిసింది. సాత్‌పూల్ వంతెన దిగువన వైకుంఠధామం పూర్తిగా మునిగిపోయింది. అందులోని సుమారు 20 అడుగుల ఎత్తున్న శివుని విగ్రహం మెడభాగం వరకు వరద నీరు ప్రవహించింది.

పంట వరద పాలు


పొలంలోకి కొట్టుకొచ్చిన బండరాళ్లను చూపుతున్న రైతు రమేశ్

ఆదిలాబాద్‌రూరల్: ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామానికి చెందిన రైతు బస రమేష్. ఈయనకు చించుఘాట్ శివారు ప్రాంతంలోని మెట్టివాగుకు అనుకోని ఏడు ఎకరాల పొలం ఉంది. అందులో నాలుగు ఎకరాలు పత్తి పంట వేయగా మరో మూడు ఎకరాల్లో సోయాబీన్ పంట వేశారు. వరదతో పెద్ద పెద్ద బండరాళ్లు వ్యవసాయ పొలంలోకి రావడంతో పంట అంత వరద నీటిపాలైంది. ఎకరానికి రూ.15వేలు పెట్టుబడి పెట్టానని, పంట చేతికి రాకముందే నేలపాలైందని కన్నీరు మున్నీరవుతున్నాడు.


కుభీర్: విఠలేశ్వర మందిరంలోకి చేరిన నీరు


బాధిత కుటుంబాలకు ఆహార పదార్థాలు, దుప్పట్లు ఇస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు


కుభీర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మునిగిన 44వ జాతీయ రహదారి

సోన్: భారీ వర్షాలకు హైదరాబాద్–నాగ్‌పూర్ 44వ జాతీయ రహదారి నీట మునిగింది. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షంలకు స్వర్ణ నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సోన్ మండలంలోని కడ్తాల్ వద్ద 44వ జాతీయ రహదారిపై వర్షం నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో గురువారం సాయంత్రం నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని కడ్తాల్‌లో 44 వ జాతీయ రహదారి హైదరాబాద్–నాగ్‌పూర్ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఇరు వైపుల జాతీయ రహదారిపై గంటల తరబడి వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సోన్ ఎస్సై సంతోషం రవీందర్ తన సిబ్బందితో అక్కడకు చేరుకొని ఎవరు వెళ్లకుండా తగిన చర్యలు చేపడుతున్నారు.


కడ్తాల్ జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు


జాతీయ రహదారిపై కిలో మీటర్ మేర నిలిచిన వాహనాలు


భైంసా/భైంసారూరల్: దేగాం గ్రామంలోకిచేరిన వరద నీరు


లక్ష్మణచాంద: చెరువును తలపిస్తున్న ఎంపీడీవో కార్యాలయ ఆవరణం


తానూరు మండలం హిప్నెల్లి చెరువుకు పడిన గండి


నిర్మల్‌రూరల్: బోట్‌లో కార్మికులను తరలిస్తున్న అధికారులు, పోలీసులు


తానూరు: కోలూరులో ఇంట్లో చేరిన వర్షపు నీరు

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గవర్నర్ సమీక్ష

- నిర్మల్ జిల్లా పరిస్థితిని వివరించిన రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి


పాల్గొన్న గవర్నర్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లాలో ఉధృతంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు తమిళిసై సౌందర్ రాజన్ జిల్లాలో వరదల పరిస్థితిని సమీక్షించారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రతినిధి యాటకారి సాయన్న జిల్లా పరిస్థితిని గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై జిల్లా ప్రస్తుత పరిస్థితులు, ఎదుర్కొంటున్న సమస్యలు, జరిగిన నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కడెం మండలం పాండవాపూర్ తాండ నుంచి 50 ఇళ్లల్ల ఖాళీ చేసి సమీపంలోని తాత్కాలిక గృహాల్లో, నవాబ్‌పేట గ్రామపంచాయతీలో 100 నివాసగృహాలు ఖాళీ చేసి 350 మందిని సమీపంలోని రైతువేదికలో ఉంచారని వివరించారు. అంబర్‌పేటలో 50 గృహాలను ఖాళీ చేసి 200 మందిని నారాయణరెడ్డి షెడ్‌లో తాత్కాలిక శిబిరాలను ఏర్పాటు చేశారన్నారు. ఖానాపూర్‌లో 70 గృహాలను ఖాళీ చేయించి 150 మందిని సమీపంలోని ఎల్ఎంఆర్ డిగ్రీ కాలేజీలో ఉంచారు. దస్తురాబాద్ మండలం దేవునిగూడా గ్రామంలో 15 ఇళ్లు ఖాళీ చేసి 60 మందికి దేవుని గూడా గ్రామపంచాయతీలో, భుక్తాపూర్ గ్రామాలో 11 ఇండ్లు ఖాళీ చేసి 45 మందికి బుక్తాపూర్ పాఠశాలలో, మున్యాల్ గ్రామం 30 ఇళ్లు ఖాళీ చేసి 156 మందికి మున్యాల్ స్కూల్లో, గొడిసెర్యాల్ గ్రామంలో 12 ఇళ్లకు చెందిన 55 మందికి, గుడిసెల స్కూల్లో పునరావాసం ఏర్పాటు చేశారని వివరించారు. నిర్మల్ కేంద్రంలో జీఎస్ఆర్ కాలనీలోని 60 ఇళ్లను ఖాళీ చేయించి, 300 మందికి అల్ఫోర్స్ స్కూల్లో, సోఫి నగర్‌లోని పది ఇళ్లకు చెందిన 32 మందిని కమ్యూనిటీ హాల్‌లోని వసతికి తరలించారని తెలిపారు. భైంసా మండలం గుండెగాం లో 50 ఇళ్లకు చెందిన 200 మందిని భైంసాలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో వసతి కల్పించినట్లు పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: ఇటీవల భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. గురువారం ఎమ్మెల్యే రేఖాశ్యాంనాయక్, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఇరిగేషన్ అధికారులతో కలిసి కడెం ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కడెం ప్రాజెక్టు స్థాయికి మించి వరద కొనసాగుతుండడంతో 14 గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నామన్నారు. ప్రాజెక్టు కింది భాగంలో ఉన్న 12 గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వారికి వసతి కల్పించామన్నారు. కడెం ప్రాజెక్టుపై సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మవద్దన్నారు. నాలుగు వరద గేట్ల మరమ్మతుల కోసం నిపుణుల కమిటీ చర్యలు చేపట్టిందన్నారు. అత్యవసరమైతే తప్పా ప్రజలు బయటకు రావద్దని సూచించారు.

కొర్టికల్ జలపాతానికి వరద హోరు



నేరడిగొండ: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కుంటాల, పొచ్చర జలపాతానికి వెళ్లకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. దీంతో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కొర్టికల్ జలపాతం వద్ద పర్యాటకులు ఆహ్లాదం పొందుతున్నారు. గురువారం జలధారాల వద్ద జాతీయరహదారిపై వెళ్లేవారు సెల్ఫీలు దిగుతూ మంత్రముగ్ధులయ్యారు.

నిండుకుండలా పొచ్చర జలపాతం



బోథ్: భారీ వర్షాలకు బోథ్ మండలంలోని పొచ్చర జలపాతం నిండుకుండలా మారింది. వరదనీరు భారీగా చేరుకోవడంతో జలపాతం నిండా నీరుచేరింది. దీంతో అటవీ అధికారులు సందర్శనకు వచ్చే వారిని అడ్డుకుంటున్నారు. మరోవైపు మండలంలోని కరత్వాడ ప్రాజెక్టుకు భారీగా నీరు చేరుకోవడంతో అలుగు దూకుతోంది.